
TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 216 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ మంగళవారం.03.03.2026 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD




# ఇండో అమెరికా ట్రేడ్ డీల్ అత్యంత ప్రమాదకరం

రంగారెడ్డి, హైదరాబాద్. :అమృత్ తెలంగాణ: ఇండో అమెరికా ట్రేడ్ డీల్ మనకు అత్యంత ప్రమాదకరమని పార్లమెంటులో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హెచ్చరించారు. ప్రధాని మోడీ చర్యలతో మనదేశంలో సైతం యుద్ధ వాతావరణం నెలకొందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు ఆయన పూర్తిగా దాసోహమయ్యారని ఎద్దేవా చేశారు. అందుకే మోడీ.. అమెరికాకు వ్యతిరేకంగా ఒక్క మాట కూడా మాట్లాడటం లేదని పేర్కొన్నారు. ఇరాన్‌లో తలెత్తిన పరిస్థితులు ఇండియాలో రాకుండా చూసుకోవాలని ఆయన దేశ ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బీజేపీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై యుద్ధానికి సిద్ధం కావాలని కాంగ్రెస్ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. వికారాబాద్ జిల్లా అనంతగిరిలో తొమ్మిది రోజులపాటు కొనసాగిన తెలంగాణ, ఏపీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల (డీసీసీలు) శిక్షణా తరగతులు సోమవారం ముగిశాయి.

ముగింపు కార్యక్రమానికి రాహుల్ గాంధీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దీంతోపాటు కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశాన్ని కూడా నిర్వహించారు. పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిళ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రణాళికబద్ధంగా తీసుకోవాల్సిన చర్యలపై డీసీసీలకు రాహుల్‌గాంధీ దిశా నిర్దేశం చేశారు. అంతర్జాతీయ, జాతీయ రాజకీయాల్లో నెలకొన్న పరిణామాల గురించి ఆయన వారితో చర్చించారు. కాంగ్రెస్ పార్టీ అహింసా వాదాన్ని నమ్ముతూ రాజకీయాలు చేస్తుంటే.. బీజేపీ హింసావాదంతో ముందుకు సాగుతోందని విమర్శించారు. తాము గాంధేయ వాదాన్ని అనుసరిస్తే.. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నేతలు గాడ్సే బాటలో ప్రభుత్వాన్ని నడుపుతున్నారని దుయ్యబట్టారు. ప్రధాని మోడీ దేశంలో మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన దుర్మార్గాలన్నీ ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని చెప్పారు.

వాటన్నింటినీ ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. డీసీసీ అధ్యక్షులే తమ పార్టీకి అసలైన సైన్యమని రాహుల్ గాంధీ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. అందువల్ల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పార్టీ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో వారి పాత్రను మరింత పెంచుతామని భరోసానిచ్చారు. ఏఐసీసీ దేశవ్యాప్త పిలుపులను నూటికి నూరుశాతం జయప్రదం చేయాలని సూచించారు. తెలంగాణ, ఏపీల్లోని సామాజికాంశాలపై అధ్యయనం చేయాలని అన్నారు. తెలంగాణలో పార్టీ, ప్రభుత్వం జోడెడ్లలాగా పని చేస్తున్నాయని కితాబిచ్చారు. సీనియర్ నేతలు, కార్యకర్తలు, నాయకులను కలుపుకుని ముందుకు పోవాలని రాహుల్ ఈ సందర్భంగా సూచించారు. అహాన్ని పక్కనపెట్టి పని చేయాలని హితవు పలికారు. 'ఇగో'ల కంటే పార్టీ ముఖ్యమనే విషయాన్ని గుర్తెరగాలని అన్నారు. ఒక్కో డీసీసీ అధ్యక్షుడు మరో పదిమంది క్రియాశీలక నాయకుల్ని తయారు చేయాలని దిశా



నిర్దేశం చేశారు. పని చేస్తున్న వారిని గుర్తించి, ప్రోత్సహించాలని కోరారు.

మార్షల్ ఆర్ట్స్‌తో క్లాస్...

సమావేశంలో రాహుల్ గాంధీ మార్షల్ ఆర్ట్స్ చేస్తూ వినూత్నంగా సందేశమిచ్చారు. అందులోని మెళకువలను డీసీసీ అధ్యక్షులకు వివరించారు. మార్షల్ ఆర్ట్స్‌ను వ్యక్తిగత జీవితానికి అన్వయించుకోవాలని సూచించారు. జాతిపిత మహాత్మా గాంధీకి ఒంటిపై ఒక బట్ట తప్ప ఏమీ ఉండదని గుర్తు చేశారు. అంతటి నిరాడంబరుణ్ని బ్రిటీష్ వారు సైతం ఏమీ చేయలేకపోయారని పేర్కొన్నారు. ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ప్రజలతో మమేకమై పని చేయాలని పిలుపునిచ్చారు. కష్టించి పని చేయండి.. రానున్న రోజులన్నీ మనవేనంటూ భరోసానిచ్చారు.

కాంగ్రెస్ శివుడు.. బీజేపీ విష్ణువు...

ఈ సందర్భంగా రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీని శివుడితో పోల్చారు. తనలో సగభాగాన్ని భార్యకు ఇచ్చిన శివుడు, నిరాడంబరంగా ఉంటారని గుర్తు చేశారు. అదే రకంగా కాంగ్రెస్ పద్ధతి సాధారణంగా ఉంటుందని తెలిపారు. అందుకు భిన్నంగా బీజేపీ విష్ణువులాగా నగలు నట్రాతో ఆడంబరంగా, అత్యంత విలాసంగా ఉంటుందని వ్యాఖ్యానించారు. వాటిని కాపాడుకోవటానికే ఆ పార్టీ ప్రజల మీద ఆయుధా(అధికారం)న్ని ప్రయోగిస్తోందని ఎద్దేవా చేశారు.

దేశం కోసం ప్రధాని అవుతా..

కాగా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... రాహుల్ గాంధీ దేశానికి ప్రధాని కావాలంటూ విజ్ఞప్తి చేశారు. ఆయన తాత నెహ్రూ, నానమ్మ ఇందిరాగాంధీ, తండ్రి రాజీవ్ గాంధీ ప్రధాని పదవిని చేపట్టి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని గుర్తు చేశారు. అదే తరహాలో ఇప్పుడు దేశాన్ని రక్షించేందుకు, విపత్కర పరిస్థితులనుంచి బయటపడేసేందుకు రాహుల్ గాంధీ కూడా పీఎం పదవిని చేపట్టాలని కోరారు. తాను ఓ ముఖ్యమంత్రిగా ఈ విజ్ఞప్తి చేయటం లేదని.. సాధారణ కాంగ్రెస్ కార్యకర్తగా అభ్యర్థిస్తున్నానని తెలిపారు. స్పందించిన రాహుల్ గాంధీ మోడీపై యుద్ధం చేసేందుకు ప్రధాని పదవిని చేపడతానని వ్యాఖ్యానించారు.

## సమీక్ష కోసం వచ్చారా?

## రూ.వెయ్యి కోట్ల కోసం వచ్చారా?



హైదరాబాద్ : అమృత్ తెలంగాణ:కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుపైన సమీక్ష కోసం వచ్చారా? లేదంటే రూ.వెయ్యి కోట్ల తీసుకుపోవడానికి వచ్చారా?అన్న అంశంపై స్పష్టత ఇవ్వాలని రాహుల్ గాంధీని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. ఈ మేరకు కేటీఆర్ పలు ప్రశ్నలతో సోమవారం ఎక్స్ ద్వారా ట్వీట్ చేశారు. ఏఐసీసీకి ఏటీఎంగా మారిన తెలంగాణ రాష్ట్రానికి స్వాగతం అంటూ చురక అంటించారు. మొన్న రాహుల్‌గాంధీకి రేవంత్‌రెడ్డి ఇస్తానన్న రూ.వెయ్యి కోట్లు తీసుకోవడానికి తెలంగాణకు వచ్చారా?అని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీలు, 420 హామీల అమలుపై మాట్లాడాలని డిమాండ్ చేశారు. హామీల అమలు పురోగతిని సమీక్షిస్తారా? లేదా చెప్పాలని కోరారు. రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని రాహుల్ గాంధీని డిమాండ్ చేశారు.


## రాహుల్‌ని ప్రధానిని చేయడమే లక్ష్యం : సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: డీసీసీ అధ్యక్షుల శిక్షణా తరగతుల ముగింపు సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశ భవిష్యత్తు కోసం, ప్రజల సంక్షేమం కోసం రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్న ఆయన.. "దేశం కోసం, మన అందరి కోసం రాహుల్ గాంధీ ప్రధాని కావాలి. గత ఐదేళ్లుగా ఆయన చేసిన నిరంతర పోరాటాల ఫలితంగానే నేడు రాహుల్ గాంధీ దేశ ప్రధాన ప్రతిపక్ష నేత అయ్యారు. దేశంలోని అనేక సమస్యలపై ఆయన అలుపెరగని పోరాటం చేస్తున్నారు. రాహుల్ గాంధీని ప్రధాని పీఠంపై కూర్చోబెట్టడమే మన తదుపరి లక్ష్యం కావాలి" అని స్పష్టం చేశారు.

తన రాజకీయ ప్రస్థానంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు సీఎం రేవంత్ రెడ్డి.. తాన్సుగ్రాజ నుండి సీఎం అయ్యాను అని తన రాజకీయ ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 19 ఏళ్ల స్వల్ప కాలంలోన్సగ్రాజ స్థాయి నుండి ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగానని, ఎమ్మెల్యేగా, పార్టీలో వివిధ పదవుల్లో పనిచేసి ఎంతో అనుభవం గడించానని తెలిపారు. తన ప్రజా జీవితంలో ఎప్పుడూ పైరవీలకు తావివ్వలేదని, కేవలం ప్రజా సమస్యల పైన గళం వినిపించడమే తన పనిగా పెట్టుకున్నానని చెప్పారు.

## భయంతోనే కేసీఆర్, హరీశ్‌రావు పిటిషన్లు




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రూ.85 వేల కోట్ల అంచనాతో ప్రారంభించిన కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.1.47 లక్షల కోట్లు ఖర్చు చేశారనీ, ఇంత చేసినప్పటికీ మేడిగడ్డ వద్ద పిల్లర్ కుంగుబాటు జరిగిందని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. పత్రికల్లో కథనాలు వచ్చినందున తమ ప్రతిష్ట దెబ్బతిందని పిటిషనర్లు ఆందోళనతో కోర్టుకు వచ్చారని పేర్కొంది. కమిషన్ విచారణకు మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరయ్యారనీ, నివేదిక వచ్చాక కమిషన్ ఏర్పాటు జీవో 6 ను సవాల్ చేశారని ఆక్షేపించింది. మేడిగడ్డ పిల్లర్ కుంగుబాటు తర్వాత రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ పీసీ ఘోష్ ఆధ్వర్యంలో విచారణ కమిషన్ ఏర్పాటుకు ఇచ్చిన జీవో 6ను సవాల్ చేస్తూ కేసీఆర్, హరీశ్, ఐఏఎస్ స్మితా సబర్వాల్, రిటైర్డు ఐఏఎస్ జోషి వేసిన పిటిషన్లను చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్లతో కూడిన డివిజన్ సోమవారం విచారించింది. ప్రభుత్వం తరపున సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదిస్తూ కమిషన్ నివేదిక ఆధారంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదనీ, సీబీఐ దర్యాప్తునకు ఆదేశించిందని వివరించారు. మేడిగడ్డ కుంగుబాటుకు కారణమైనవాళ్లు ఎవరో తేలాల్సివుందనీ, కమిషన్ ఏర్పాటు జీవో జారీ సమయంలో ఆ ప్రక్రియకు హరీశ్‌రావు అభ్యంతరం వ్యక్తం చేయలేదని అన్నారు. ప్రజా ప్రయోజనాల నేపథ్యంలో నిజనిర్ధారణ కోసం కమిషన్ ఏర్పాటు అయ్యిందన్నారు. పిటిషనర్లు ఎందుకు భయపడతు న్నారో అర్థం కావడం లేదని చెప్పారు. కమిషన్ నోటీసు ఇస్తే సవాల్ చేయలేదనీ, కమిషన్ విచారణకు సహకరించిన హరీశ్‌రావు నివేదికను సవాల్ చేయడంలో ఆంతర్యం ఏంటో తెలియడం లేదన్నారు. కమిషన్ ఏర్పాటు నిబంధనలోనే బాధ్యులను గుర్తించాలని ఉందని గుర్తు చేశారు. పిటిషనర్ కోరిన వివరాలన్నీ నోటీసు ద్వారా విచారణకు పిలిచినట్టు చెప్పారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదికలో బ్యారేజీ నిర్మాణంలోని లోపాల గురించి పేర్కొందని వివరించారు. ప్రధానంగా నిపుణుల కమిటీ పరిశీలించి మేడిగడ్డలో రిజర్వాయర్ నిర్మాణం చేయొద్దని తేల్చి చెప్పినప్పటికీ గత ప్రభుత్వ అధినేత కేసీఆర్ ఖాతరు చేయలేదని అన్నారు. క్యాబినెట్‌లో చర్చ చేయలేదనీ, ఆమోదం కూడా లేదని చెప్పారు. నిర్మాణం చేయాలనే నిర్ణయం తీసుకున్న తర్వాత కూడా ఆమోదం తీసుకోలేదని అన్నారు. ఈ అంశంపై వాదనలు మంగళవారం కొనసాగనున్నాయి.

దర్గా తరలింపుపై హైకోర్టులో పిటిషన్

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని దర్గా తరలింపు ప్రక్రియను సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యంలో వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలను అందజేయాలని రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, జిల్లా కలెక్టర్, వక్ఫ్ బోర్డు సీఈవో, జిల్లా ఎస్పీ, వేములవాడ ఆలయ ఈవోలను ఆదేశించింది. వేములవాడలోని దర్గా తరలింపు చర్యలను సవాల్ చేస్తూ నజీమా వేసిన పిటిషన్‌ను జస్టిస్ బి విజయసేన్‌రెడ్డి సోమవారం విచారించారు. వేములవాడలో రాజరాజేశ్వరి ఆలయం చాలా ప్రసిద్ధి చెందినదనీ, భక్తుల తాకిడి పెరుగుతున్నందున వాళ్లకు వసతుల కల్పన కోసం ప్రార్థనా మందిరాన్ని వసతులున్న మరోచోట కేటాయింపు జరిగిందని వివరించారు. ఇదేమీ వేరే మతానికి వ్యతిరేకం కానేకాదని చెప్పారు. ప్రజాభిప్రాయం మేరకే దర్గా తరలింపు జరుగుతోందని అన్నారు.

## జనాభా దామాషా ప్రకారం ఎస్సీ రిజర్వేషన్లు పెంచాలి



హైదరాబాద్ : అమృత్ తెలంగాణ:జనాభా దామాషా ప్రకారం ఎస్సీ రిజర్వేషన్లు పెంచాలనీ, ఆ మేరకు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే తీర్మానం చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఎస్సీ రిజర్వేషన్ల పెంపునకు జాగృతి దళిత సంఘాలతో కలిసి ఉద్యమిస్తుందని ఆమె తెలిపారు. ఎస్సీ ఉప కులాలకు విద్య, ఉద్యోగ రంగాలతో పాటు రాజకీయ రిజర్వేషన్లు దక్కాలన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని జాగృతి రాష్ట్ర కార్యాలయంలో ఆమె ఎస్సీ ఉప కులాల నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీల జనాభా 15 శాతం నుంచి 18 శాతానికి పెరిగినట్టు గతంలో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేతో పాటు ప్రస్తుత ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, రాజకీయ, కుల గణనలో స్పష్టం అయిందని గుర్తుచేశారు. పెరిగిన ఎస్సీల జనాభాకు అనుగుణంగా ఎస్సీ రిజర్వేషన్లను 18 శాతానికి పెంచాలని కోరారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేసే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం చేపట్టే జనగణన పూర్తి అయి అధికారికంగా లెక్కలు ప్రకటించిన తర్వాత ఎస్సీ రిజర్వేషన్లు పెంచుతామని ప్రకటించిందని కవిత గుర్తు చేశారు. దానికి అనుగు ణంగా రిజర్వేషన్ల పెంపునకు అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ ఉప కులాలతో కలిసి

## ఖమేనీ భార్య కూడా మృతి..



హైదరాబాద్ : అమృత్ తెలంగాణ:ఇరాన్‌లో మరో విషాదం చోటుచేసుకుంది. శనివారం ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ, కుమార్తె, అల్లుడు, మనవరాలు సహా పలువురు కుటుంబ సభ్యులు ప్రాణాలు కోల్పోయారు. ఆదివారం ఇరాన్ మీడియా అధికారికంగా ధృవీకరించింది.

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో ఆలస్యం చేయకూడదు: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.



నిర్మల్ జిల్లా కలెక్టరేట్లో ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



ప్రజావాణిలో పాల్గొన్న సంబంధిత అన్ని శాఖల అధికారులు

నిర్మల్ జిల్లా కలెక్టరేట్ మార్చి 2 అమృత్ తెలంగాణ ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో ఆలస్యం చేయకూడదని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆమె స్వయంగా స్వీకరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్ కు సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు ప్రభుత్వ విద్యా సంస్థలు, వసతి గృహాలు తనికి చేస్తూ ఉండాలని తెలిపారు. వేసవి కాలం, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నీటి ఎద్దడి ఉండే ప్రాంతాలు గుర్తించి, నీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. మండల ప్రత్యేక అధికారులు యూరియా యాప్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తూ ఉండాలన్నారు. జిల్లాలో ఫిబ్రవరి 8వ తేదీ నుంచి ప్రారంభమైన యూరియా బుకింగ్ యాప్ ద్వారా, ఇప్పటివరకు రైతులు, 1 లక్షా 60 వేల యూరియా బస్తాలు బుక్ చేసుకొని, 1 లక్షా 40 వేల యూరియా బస్తాలు తీసుకున్నారని చెప్పారు. ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్నందున, మండల ప్రత్యేక అధికారులు, సంబంధిత మండలాల్లో పరీక్ష కేంద్రాలను తనిఖీ చేస్తూ ఉండాలన్నారు. సీఎం కప్ పోటీలలో రాష్ట్రస్థాయిలో జిల్లాకు 4 బంగారు పతకాలు, 8 వెండి పతకాలు, 13 కాంస్య పతకాలు కలిపి మొత్తం, 25 పతకాలు రావడం గర్వకారణం అని తెలిపారు. ఇందుకుగాను, అధికారులకు, కోచ్ లకు, క్రీడాకారులకు అభినందనలు తెలియజేశారు. అంతకుముందు, ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన డిసిఓ నర్సయ్య ఆత్మకు శాంతి చేకూరాలని కలెక్టర్, అధికారులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లా అధికారి మృతి చెందడం బాధాకరమైన విషయమని విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ వైస్ చైర్మన్ ను ఘనంగా సన్మానించిన నిర్మల్ వైద్యులు



నిర్మల్ వైస్ చైర్మన్ అప్పల గణేష్ చక్రవర్తిని సన్మానిస్తున్న నిర్మల్ వైద్యులు

నిర్మల్ జిల్లా మార్చ్ 2 అమృత్ తెలంగాణ నిర్మల్ జిల్లా కేంద్రంలో సోమవారం నూతనంగా ఎన్నికైన మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి ని శాలువతో ఘనంగా సన్మానించి న ప్రముఖ వైద్యులు వారు మాట్లాడుతూ నిర్మల్ పట్టణ ప్రజలకు మీరు అందుబాటులో నిర్మల్ అభివృద్ధికి పాటుపడుతు సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్న తీరు అభినందనీయమని తెలిపారు

ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్స్ బి.ఎల్. నర్సింహారెడ్డి, రఘునందన్ రెడ్డి,రాంచంద్రారెడ్డి, కూన ప్రదీప్, శరత్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు హోళి పండుగ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే



ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

నిర్మల్ జిల్లా ముధోల్ మార్చ్ 2 అమృత్ తెలంగాణ ముధోల్ నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి ఒక్కరి జీవితం రంగుల మాయం కావాలని, ప్రజలంతా సుఖ సంతోషాలతోఉండాలని ఆయన ఆకాంక్షించారు. పండుగలో కెమికల్ తో కూడిన రంగులు వాడకుండా సహజ సిద్ధమైన రంగులు వాడాలన్నారు. శాంతియుతంగా పండుగను జరుపుకోవాలని కోరారు.

# కామాదహన కార్యక్రమం

## పాల్గొన్న ప్రజా ట్రస్ట్ చైర్మన్ దంపతులు



కామాదాన వేడుకల్లో పాల్గొన్న ప్రజా ట్రస్టు చైర్మన్ దంపతులు

నిర్మల్ జిల్లా భైంసా మార్చి 2 అమృత్ తెలంగాణ భైంసా మండలం దేగాం దత్తాత్రి మహారాజ్, దేవస్థలం లో గ్రామస్థుల ప్రత్యేక ఆహ్వానం మెరకు ప్రజా ట్రస్ట్ చైర్మన్ బోస్లే మోహన్ రావు పటిల్, దంపతులు కలిసి కామాదహన కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమన్ని విజయవంతం చేయడం జరిగింది.

# బాల్య వివాహ నిర్మూలన ప్రచార రథాన్ని ప్రారంభించిన జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు....




బాల్యవివాల నిర్మూలన ప్రచార రథాన్ని ప్రారంభించిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు,

నిర్మల్ మార్చ్ 2 అమృత్ తెలంగాణ నిర్మల్ జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలన, 100 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రచార రథాన్ని, సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జెండా ఊపడం ద్వారా ప్రారంభించారు. బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించాలనే ఉద్దేశంతో "బాల్య వివాహ రహిత భారత్" కార్యక్రమంలో భాగంగా ఈ ప్రచార రథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఈ ప్రచార రథం ద్వారా జిల్లాలోని అన్ని గ్రామాలు, విద్యాసంస్థల్లో విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. 18 సంవత్సరాల లోపు బాలికలకు, 21 సంవత్సరాల లోపు బాలురకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలు పిల్లల ఆరోగ్యం, విద్య, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. బాల్య వివాహాల నివారణకు ప్రజలందరూ బాధ్యతగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజన్ సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ శరత్ కుమార్, రాజు, బాలల పరిరక్షణ అధికారి మురళి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ వహీద్, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ గంగాధర్, మిషన్ శక్తి సిబ్బంది, విజన్ సంస్థ సిబ్బంది, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రాణం ఉన్నంతవరకు నిరుపేదలకు సేవ చేస్తాం

చండూరు : ప్రాణం ఉన్నంతవరకు నిరుపేదలకు సేవ చేస్తాం అని గాంధీజీ ఫౌండేషన్ చైర్మన్, చండూర్ మున్సిపల్ చైర్మన్ కోడి శ్రీనివాసులు తెలిపారు. స్థానిక గాంధీ స్కూల్లో గాంధీజీ ఫౌండేషన్ వారి 27వ నెల సరుకులు నిరుపేదలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మా జీవితం ఉన్నంతవరకు గాంధీజీ ఫౌండేషన్ ద్వారా నిరుపేదలకు ఉచిత నిత్యావసర సరుకుల పంపిణీతో పాటు మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తూ, సమాజంలో ఆదర్శవంతంగా జీవిస్తామని చెప్పారు.

# కారుణ్య నియామకాలు పొందినవారు క్రమశిక్షణతో తమ విధులు నిర్వర్తించాలి: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్





కారుణ్య నియామకాలు పొందిన వారికి పత్రాలను అందజేస్తున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ జిల్లా మార్చి 2 అమృత్ తెలంగాణ కారుణ్య నియామకాలు పొందిన ఉద్యోగులందరూ క్రమశిక్షణతో తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో కారుణ్య నియామకాలు పొందిన 18 మంది అభ్యర్థులకు నియామక పత్రాలను కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నియామకాలు పొందిన వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. వివిధ కారణాల వల్ల గత మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఏ స్థాయి ఉద్యోగమైనా బాధ్యతతో, క్రమశిక్షణతో నిర్వహించి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మొత్తం 18 మందిలో 13 మందికి జూనియర్ అసిస్టెంట్, 4 మందికి ఆఫీస్ సబర్డినేట్, 1 వ్యక్తికి కామాటి పోస్టులకు సంబంధించిన నియామక పత్రాలు అందజేశారు. నియామక పత్రాలు అందుకున్న వారు జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, కలెక్టరేట్ ఏవో స్వాతి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా 'హెల్త్ మిషన్ – 100' ప్రారంభం:జిల్లా కలెక్టర్ రాజర్షిషా





సమావేశంలో మాట్లాడుతున్న అదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి రాష్ట్రవ్యాప్తంగా ప్రజారోగ్యాన్ని మెరుగుపరచడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా "హెల్త్ మిషన్ – 100" ప్రత్యేక ఆరోగ్య కార్యక్రమం చేపట్టిందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో "హెల్త్ మిషన్ – 100" ప్రత్యేక ఆరోగ్య కార్యక్రమం పై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నేటి మార్చి 2 నుండి జూన్ 9 వరకు కొనసాగే ఈ బృహత్తర కార్యక్రమం ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, కౌమార దశలోని వారు, వృద్ధులకు నాణ్యమైన వైద్య సేవలను నేరుగా చేరువ చేయడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని అన్నారు. ఈ మిషన్ మొత్తం నాలుగు దశల్లో అమలవుతుందని కలెక్టర్ తెలిపారు. మొదటి దశలో భాగంగా మార్చి 31 వరకు మాతా శిశు ఆరోగ్యం, పాఠశాల విద్యార్థుల హెల్త్ స్క్రీనింగ్, వృద్ధులకు ప్రత్యేక ఓపీ సేవలు అందిస్తారు. మార్చి 27 నుండి ప్రారంభమయ్యే రెండవ దశలో 30 ఏళ్లు పైబడిన వారికి బీపీ, షుగర్ మరియు క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహిస్తారు. మూడవ దశలో క్షయ, హెచ్ఐవి వంటి అంటువ్యాధుల నియంత్రణతో పాటు ఎండదెబ్బ నివారణ చర్యలపై అవగాహన కల్పిస్తారు. చివరిగా నాలుగవ దశలో పట్టణ ప్రాంతాల్లోని 145 యూపీహెచ్‌సీలను (ఖూనజం) 'పాలీ క్లినిక్‌లు'గా మార్చి స్పెషలిస్ట్ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా, ఈ 100 రోజుల్లో రాష్ట్రంలోని 42 లక్షల మంది పొదుపు సంఘాల మహిళలకు 30 రకాల పారామితులతో కూడిన డిజిటల్ హెల్త్ ప్రొఫైలింగ్‌ను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో మొబైల్ మెడికల్ యూనిట్ల ద్వారా ఇంటి వద్దకే వైద్య సేవలు అందిస్తామని, కొత్తగా నిర్మించిన టిమ్స్ ఆసుపత్రుల ప్రారంభంతో వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తాయని వివరించారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి నరేందర్ రాథోడ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలను తక్షణం పరిష్కరించాలి. జిల్లా కలెక్టర్ రాజర్షి షా



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించే ప్రతి అర్జీని త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి ద్వారా వచ్చే ప్రతి దరఖాస్తులను నిర్లక్ష్యం చేయకుండా శాఖల వారీగా సమీక్షించి, నిర్ణీత గడువులో పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, సామాజిక భద్రతా పెన్షన్లు, ఉపాధి హామీ పనులు, భూభారతి సమస్యలు తదితర అంశాలకు సంబంధించి మొత్తం 87 అర్జీలు అందినట్లు తెలిపారు. ఆయా అర్జీలను సంబంధిత శాఖలకు వెంటనే పంపించి, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు న్యాయం చేయడమే లక్ష్యంగా పనిచేయాలని, సమస్యల పరిష్కారంలో జాప్యం జరగకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో ఆర్డీఓ స్రవంతి, డిఆర్డీఓ రవీందర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడి మనోహర్, ఏవో వర్ణ, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ మన ఇంటి బిడ్డే -- ఆడే గజేందర్

## మున్నూరుకపు సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన బండారి అనూష సతీష్ ని ఘనంగా సన్మానించారు




అదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ అనుష సతీష్ దంపతులను సన్మానిస్తున్న ఆడే గజేందర్

అమృత్ తెలంగాణ ఇచ్చోడా న్యూస్ బజార్ హత్నూర్ మండలంలోని దేహగం గ్రామంలో మున్నూరుకపు సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన బండారి అనూష సతీష్ ని ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమానికి బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీఇంచార్జి ఆడే గజేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ "ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ మన ఇంటి బిడ్డే, మన నియోజకవర్గ బిడ్డే. ప్రజల ఆశీర్వాదంతో ఈ స్థాయికి చేరుకున్న బండారిఅనూష సతీష్ ఆదిలాబాద్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తారని ఆశిస్తున్నాను. కాంగ్రెస్ పార్టీ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుంది" అని అన్నారు ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, బజార్ హత్నూర్ మండలఅధ్యక్షుడు జెల్కేపాండురంగ్,మోర్కండి సర్పంచ్ తొడసం నాందేవ్,చందునాయక్ తండాసర్పంచ్‌రజాక్,కళ్ళెంవిఠల్,పోరెడ్డి నారాయణ, నరేష్,దేవన్న, శివుడు, సయ్యద్ సల్మాన్, సూర్యవంశీ పండురంగ్,కిషన్ ఉన్నారు

# ఉచిత శిక్షణతో ఉపాధి అవకాశాలు పెంచుకోవాలి : జగిత్యాల ఆర్డీవో మధుసూదన్




జగిత్యాల, అమృత్ తెలంగాణ మార్చి 2: వాల్మీకి ఆవాసం సేవా భారతి ద్వారా అందిస్తున్న ఉచిత శిక్షణ ను ఉపయోగించుకుని ఉపాధి అవకాశాలు మెరుగు పరుచుకోవాలని జగిత్యాల ఆర్డీవో మధుసూదన్ గౌడ్ అన్నారు. వాల్మీకి ఆవాసం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం, కంప్యూటర్ శిక్షణ కేంద్రం లో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సోమవారం వాల్మీకి ఆవాసం లో నిర్వహించిన కార్యక్రమంలో సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మధుసూదన్ గౌడ్ మాట్లాడుతూ సేవా భారతి ద్వారా నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ నిరుద్యోగులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. గత 33 సంవత్సరాలుగా నిరుపేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించడమే కాకుండా యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు కంప్యూటర్, కుట్టు మిషన్, అగ్ని వీర్ తదితర కోర్సుల్లో ఉచిత శిక్షణను అందించడం,అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆర్ఎస్ఎస్ ప్రాంత సేవా ప్రముఖ శివశంకర్ మాట్లాడుతూ సేవా భారతి దేశవ్యాప్తంగా సుమారు రెండు లక్షల సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. సమాజానికి ఏది అవసరమో దానిని పూర్తి చేసేందుకు సేవా భారతి నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. దేశంలోని ప్రజలంతా తమ సోదరులే అనే భావనతో ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. సమాజంలోని రుగ్మతలను రూపుమాపి శక్తివంతమైన సమాజ నిర్మాణం కోసం సేవా భారతి చేపడుతున్న కార్యక్రమాలకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ యాద రామకృష్ణ,వాల్మీకి ఆవాస అధ్యక్షులు జడిగే పురుషోత్తం, సేవా భారతి జిల్లా అధ్యక్షులు సుబ్రహ్మణ్యం, రాజ్ మనోహర్ రెడ్డి,ఆవాస కమిటీ సభ్యులు సంపూర్ణ చారి, మధుకర్,మల్లేశం, శ్రీనివాస్, కైలాసం, అశోక్ రావు, డాక్టర్ ధనుంజయ, బొమ్మర సత్యనారాయణ, మల్లేశం, చంద్రశేఖర్, కవిత, స్వప్న, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

# కమనీయం రమణీయం శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం

- ఓడిభియ్యం సమర్పించిన మహిళలు
- స్వామివారికి పంచామృత అభిషేకాలు
- వేధమంత్రో చరణ మధ్యయజ్ఞ పుర్ణహృతి చేసిన అర్చకులు
- అలయం లో బలిహరణ వేదుకలు,స్వామి వారి పల్లకి సేవ
- అలయ కమిటీ, అభివృద్ధి కమిటీ అధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం
- స్వామి వారికి ప్రత్యేక మెక్కులు చెల్లించుకున్న భక్తులు




ఇబ్రహీంపట్నం అమృత్ తెలంగాణ మార్చి 2ల జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలం లోని వేములకుర్తి గ్రామంలో ప్రతి సవత్సరం వార్షికంగా అతిపురతన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు హోలి కి ముదు రోజుల ముందు నుండి ప్రారంభమైయి.అంగ రంగ వైభవంగా జరుగుతాయి.సోమవారం గ్రామస్తులు దాతల సహకారం తో దేవలయకమిటీ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కళ్యణం ఎర్పాట్లు చేయుగా ఖానపుర్ వాస్తవ్యులు యజ్ఞ అర్చకులు చక్రపాణి అగమనరసింహమూర్తి చార్యులు ల కరకములచే స్వామి వారి కళ్యణం జరిగింది. ముడు రోజులు గా స్వామి వారి అలయం లో లోక కళ్యణం కోసం జరుగుతున్న యజ్ఞం పుర్ణహృతి చేశారు.అనతరం అలయం లో అలయ బలిహరణ కార్యక్రమం నిర్వహించారు. అనతరం స్వామి వారిని ప్రత్యేక పల్లకి లో బజాబజంత్రిలతో ఎదుర్కొంటూ మండపంలో పంచామృత అభిషేకం నిర్వహించి వేదమంతుడు చరణ మధ్య ,కల్యాణ మండపంలో కోలువుదిర్చి శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి అలివేలు మంగమ్మల కు కళ్యణం నిర్వహించారు.కళ్యణం అనతరం మహిళలు ఓడిబియ్యం సమర్పించారు.భక్తులు ప్రత్యేక మెక్కులు చెల్లించు కున్నారు.దేవలయ కమిటీ అధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిగింది. అలయం వేంకటేశ్వర స్వామి వారిని భక్తులులు ప్రత్యేక పుజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ తరి రామనుజం, ఉపసర్పంచ్ బర్మ మల్లయ్య,యామపుర్ సహకారసంఘ మాజీచైర్మన్ అంకతి రాజన్న , మాజీ సర్పంచ్ సున్నం నవ్యశ్రీ,మాజీ ఎంపిటిసి లు దేశేట్టి మమత,పెంట లక్ష్మీ, అర్చకులు మంత్ర రాజం శ్రీనివాస్ చార్యులు,మంత్రరాజం జానకిరామకృష్ణ చార్యులు, మంత్రరాజం అరవింద్ కృష్ణా చార్యులు, సాముజి నవిన్ చార్యులు ,నాయకులు సున్నం సత్యం, పెంట లింబద్రి,మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుమ్మల రమేష్ ,పోతరాజు శివరాజం,దేశేట్టి రాజరెడ్డి,గుజ్జె గంగాధర్, లోక సురేష్, అరె రమేష్, గుమ్మల నరేష్,గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ గుమ్మల గంగన్న, అలయకమిటీ అధ్యక్షుడు కోబ్బజి లక్ష్మీ నర్సయ్య, ఉపాధ్యక్షుడు రాదరపు రవి,కోశాధికారి అరె లింగరెడ్డి, రైటర్ రెడ్డవేన లక్ష్మీ నర్సయ్య, బస మల్లేశ్,కుమ్మరిపెళ్ళి నరేష్, నలిమేల రాజేంధర్, వనతడుపుల శ్రీనివాస్, నాంపల్లి గణేష్, అకు రాజేశ్,మైలరపు గంగారాం, అల్లకోండ కిషన్,గుగ్లవత్ రాజేంధర్, బర్కం రాజగంగారాం,అకు చిన్న రాజం,మంగ్లారపు వినోద్, సుద్దాల రెడ్డి భక్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# హోలీ పండుగలో యువత జాగ్రత్తలు పాటించాలి.

- జిల్లావ్యాప్తంగా ప్రతిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు.
- హోలీ పండుగకు డీజీలకు అనుమతి లేదు
- జిల్లా లో ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ చెక్పోస్ట్ లు ఏర్పాటు.
- యువత చెరువుల లో, వాగుల లో, లోతట్టు ప్రాంతాలలో ఈతరానిదే వెళ్ళవద్దు.
- జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు, సూచనలు.
- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి రేపటి హోలీ పండుగ సందర్భంగా జిల్లా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ హోలీ పండుగ దృష్ట జిల్లా వ్యాప్తంగా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని, ఎలాంటి బలవంతపు రంగులను చల్లే విధంగా, ఇతర మతాల వారిని గౌరవిస్తూ ఉండాలని, రంగులు చల్లడం లాంటివి చేయవద్దని తెలిపారు. వాగులలో, నదులలో, లోతట్టు ప్రాంతాలలో ఈతకు వెళ్లే సమయంలో జాగ్రత్తలు పాటించాలని ఈతరానిదే వెళ్లకూడదని తెలిపారు.

వీలైనంతవరకు సహజసిద్ధమైన రంగులను ఉపయోగించి హోలీ పండుగను జరుపుకోవాలని సూచించారు. యువత మద్యం సేవించి వాహనాలను నడపవద్దని పట్టణంలో మరియు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేకంగా డ్రంక్ అండ్ డ్రైవ్ పోస్టులను ఏర్పాటు చేసి తనిఖీ చేయడం జరుగుతుందని తెలిపారు.

తల్లిదండ్రులు యువతకు, పిల్లలకు గమనిస్తూ ఉండాలని, సరైన మార్గదర్శనం చేయాలని విజ్ఞప్తి చేశారు. హోలీ పండుగను ప్రశాంత వాతావరణంలో, శాంతియుతంగా, స్వీయ భద్రత ను దృష్టిలో ఉంచుకొని పండుగను జరుపుకోవాలని జిల్లా పోలీసు శాఖకు సహకరించాలని తెలిపారు.

ఇష్టం లేని వ్యక్తులపై, వాహనాలపై, బహిరంగ ప్రదేశాల్లో బలవంతంగా రంగులు నీళ్లు చల్లకూడదని స్పష్టం చేశారు. రోడ్లపై గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజాశాంతికి ప్రజల భద్రతకు భంగం కలిగించేలా చేయవద్దని తెలిపారు.

ఈ కార్యక్రమంలో శిక్షణ ఐపిఎస్ రాహుల్ కాంత్, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి పోతారం శ్రీనివాస్, ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, సిఐలు బి సునీల్ కుమార్, కె ఫణిదర్, ప్రణయ్ కుమార్,ప్రేమ్ కుమార్, డి గురుస్వామి, ఎస్సై లు వి విష్ణువర్ధన్, రాజశేఖర్, పీర్ సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


# జగిత్యాలలో దీప దూప నైవేద్య (డీడీఎన్ ) సర్వసభ్య ,సమావేశం



జగిత్యాల అమృత్ తెలంగాణ మార్చి 02: దూప, దీప నైవేద్య జగిత్యాల జిల్లా సర్వ సభ్య సమావేశం స్థానిక SVLR గార్డెన్ లో జరిగింది. ఈ సమావేశం లో పాల్గొన్న డీడీఎన్ గౌరవ అధ్యక్షులు గంగు ఉపేంద్ర శర్మ మాట్లాడుతూ డీడిఎన్ అర్చకుల సమస్యలు పరిష్కారం చేసే దిశగా ప్రయత్నం చేస్తానని రాజశేఖర్ రెడ్డి హయాంలో రైతే రాజు అన్నట్టుగా గ్రామాల్లో పాడి పంటలు మంచిగా ఉండాలంటే గ్రామ దేవాలయాల్లో ఉండే అర్చకులు వారి అభివృద్ధి కోరుతూ అర్చనలు నిర్వహించేలా ఈ స్కీమ్ ప్రారంభించారని అనంతరం పట్టణాల్లో కూడా స్కీం వర్తించేలా చేశామని అర్చకులు మన ధర్మాన్ని కాపాడుతూ సర్వేజనా సుఖినో భవంతు అని ఒక అర్చకుడే దీవిస్తాడని అలాంటి అర్చకులకు గౌరవ భృతి క్రింద పది వేల రూపాయలు ఇస్తుందని కావున అర్చకులు దేవాలయాల్లో నిత్య పూజ కైంకార్యాలు జరుపాలని మీ సంక్షేమం కొరకు ఎల్లవేళలా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమం లో డీడీఎన్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీకాంత్ స్వామి,జిల్లా అధ్యక్షులు నాగరాజు మహేంద్ర చారీ జక్కాపురం నారాయణ స్వామి, పదిరి నారాయణ రావు, ప్రవీణ్ కుమార్, ఆత్మారాం, శ్యామ్ శర్మ, ఫణింద్ర శర్మ, శంకర్ శర్మ మరియు కొండ గట్టు దేవాలయ రిటైర్డ్ అర్చకులు తిరుక్కోవేల మారుతి, వివిధ మండలాల అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

# హోలీ పండుగను సురక్షితంగా జరుపుకోవాలి,

## ఎదుటివారికి ఇబ్బంది కలిగించవద్దు: జిల్లా ఎస్పి అశోక్ కుమార్.



జగిత్యాల అమృత్ తెలంగాణ మార్చి 02:జిల్లా ప్రజలు హోలీ పండుగను ఆనందభరితంగా, సురక్షిత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపిఎస్ సూచించారు. హోలీ వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ శాఖ తరఫున భద్రతా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా యువకులు అత్యుత్సాహం ప్రదర్శించకుండా ద్విచక్ర వాహనాలపై ర్యాష్ డ్రైవింగ్ చేయరాదని, స్టంట్లు చేయడం, ముగ్గురు లేదా నలుగురు ఒకే వాహనంపై ప్రయాణించడం, బైక్లకు సైలెన్సర్ తొలగించి నడపడం వంటి చర్యలు ప్రమాదకరమని అదేవిధంగా మైనర్లు వాహనాలు నడపడం చట్టవిరుద్ధమని, హోలీ రోజున మైనర్ డ్రైవింగ్ చేసే వారిని పట్టుకుని వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని అన్నారు. హోలీ వేడుకల సందర్భంగా జిల్లాలో విస్తృత స్థాయిలో పోలీస్ పెట్రోలింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించబడతాయని తెలిపారు. పండుగ సందర్భంగా ఇతరులపై బలవంతంగా రంగులు వేయడం, అసభ్యంగా ప్రవర్తించడం, మహిళలను వేధించడం, గొడవలు సృష్టించడం, సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేయడం వంటి చర్యలపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే హోలీ అనంతరం స్నానాల కోసం చెరువులు, కాల్వలు, అధిక నీటి ప్రవాహం ఉన్న ప్రాంతాలు, లోతైన నీటిలోకి వెళ్లడం ప్రమాదకరమని గతంలో జరిగిన ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తలు పాటించాలని సూచించారు.జిల్లా ప్రజలందరూ పరస్పర గౌరవంతో ఇతర మతాల వారిని గౌరవిస్తూ, మత సామరస్యంతో జరుపుకోవాలని తెలిపారు.జిల్లా ప్రజలందరికీ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

# మాదారంలో బయటపడ్డ పురాతన విష్ణుమూర్తి విగ్రహం



మల్హర్ రావు :అమృత్ తెలంగాణ: మహాముత్తారం మండలం మాదారం గ్రామ శివారులోని పెద్ద వాగులో ఆదివారం పురాతన విష్ణు మూర్తి విగ్రహం బయటపడింది. మూడేళ్ల కిందట వాగులో చేపలు పట్టేందుకు వెళ్లిన గ్రామస్థులు విగ్రహాన్ని చూశారు. పూజలు చేసి వది లేయడంతో ఇసుకలో కూరుకుపోయింది. మళ్లీ ఈ ఏడాది వాగులో తల భాగం కనిపించింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. హైదరాబాద్ కు చెందిన ఓ వ్యక్తి స్పందించి గ్రామానికి చేరుకొని చింతకాని, జగ్గయ్య పల్లి గ్రామస్థులు, జేసిబి సహాయంతో విగ్రహాన్ని ఆదివారం బయటకు తీయించారు. విగ్రహాన్ని తమ గ్రామానికి తీసుకెళ్తామని జగ్గయ్యపల్లి గ్రామస్థులు పట్టుబట్టారు. విగ్రహం తన చేను బయట పడటంతో ఆలయ నిర్మాణానికి స్థలం ఇస్తానని, ఇక్కడే ప్రతిష్ఠించాలని ఓ రైతు కోరాడు.

రెండు మూడు రోజుల్లో ఆయా గ్రామాల పెద్దల సమక్షంలో మాట్లాడి తేల్చుకుందామని విగ్రహాన్ని వాగులోనే ఉంచి వెళ్లిపోయారు. విగ్రహం రూపాన్ని బట్టి కాకతీయుల కాలం నాటిదిగా చర్చించుకుంటున్నారు. విగ్రహం ముక్కు, చేతులు, భుజం భాగంలో కొంత ధ్వంసమై ఉంది. గుప్తనిధుల వేటగాళ్లు గతంలో విగ్రహాన్ని ధ్వంసం చేసినట్లు అనుమానాలున్నాయి.

# తల్లిదండ్రులను పట్టించుకోని తనయులు



ఆలేరు : అమృత్ తెలంగాణ:యాదాద్రి భువనగిరి జిల్లా నూతన కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన అనురాగ్ జయంతి సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కన్న కొడుకులు నిర్లక్ష్యంతో తల్లిదండ్రుల బాగోగులు పట్టించు కోకపోవడంతో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి కి వృద్ధ దంపతులు మొరపెట్టుకున్నారు. మానవతా హృదయంతో చలించిపోయిన కలెక్టర్ ఆ వృద్ధ దంపతులను ఆదరించి, వయోవృద్ధుల ఆశ్రమంలో చేర్పించారు.

వివరాల్లోకి వెళితే ఆలేరు మండలం కొలనుపాక గ్రామానికి చెందిన ధర్మ సోమిరెడ్డి రమణమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. తల్లిదండ్రులు సంపాదించిన ఆస్తిని పంచుకొని, వారిని నిర్లక్ష్యం చేయడంతో గత సంవత్సరం డిసెంబర్ నెలలో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. మరుసటి రోజే భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి గ్రామానికి విచారణకు వెళ్ళి, పూర్తి వివరాలు సేకరించారు. వృద్ధ దంపతుల కుమారులైన ధర్మ వెంకట నరసింహ రెడ్డి, ధర్మ గోవర్దన్ రెడ్డి లను పలుమార్లు ఆర్డీఓ కార్యాలయం లో కౌన్సిలింగ్ ఇచ్చారు.

అనంతరం భువనగిరి ఆర్డీవో, సీనియర్ సిటిజన్ యాక్ట్ 2007 ప్రకారం సబ్ డివిజన్ ట్రిబ్యునల్, వెల్ఫేర్ ఆఫ్ సీనియర్ సిటిజన్స్, రాజస్వ మండలాధికారి భువనగిరి గారి ఉత్తర్వు 2647/2025, తేదీ 27-01-2026 నాడు జడ్జిమెంట్ ఆర్డర్ పంపించారు.అయినా ఆ కుమారులు మారలేదు, ఆర్డీఓ ఆర్డర్ ను బేఖాతరు చేసారు.

దిక్కుతోచని ఆ వృద్ధ దంపతులు అప్పిలేట్ అధికారి అయిన జిల్లా కలెక్టర్ ను సోమవారం ప్రజావాణిలో కలిసి మొరపెట్టుకున్నారు. మాకు ఎవరూ లేరు. మాకు మీరే దిక్కు.. మమ్మల్ని అనాథాశ్రమంలో చేర్పించండి అంటూ ప్రాధేయపడ్డాడు. దీంతో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆ వృద్ధ దంపతులకు అండగా నిలిచారు. వారిని చౌటుప్పల్ మండలం పెద్ద కొండూరులోని వయోవృద్ధుల ఆశ్రమంలో చేర్పించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో తల్లిదండ్రుల బాగోగులు చూడకుండా నిర్లక్ష్యం చేసే కొడుకులకు ఈ సంఘటన కనువిప్పు కలుగాలని ఆశిద్దాం.

## స్వయం అనుభవం కోసమే స్వపరిపాలన దినోత్సవం

చండూర్ అమృత్ తెలంగాణ: విద్యార్థులకు స్వయం అనుభవం కోసమే స్వపరిపాలన దినోత్సవంను నిర్వహించినట్లు చండూరు మున్సిపాలిటీలోని గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్, ట్రస్మా జిల్లా అధ్యక్షులు, చండూరు మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు అన్నారు. సోమవారం గాంధీజీ విద్యాసంస్థలలో నిర్వహించిన స్వపరిపాలన దినోత్సవ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఒక్కరోజు పాలనలో విద్యార్థులు నాయకులుగా, ప్రజాప్రతినిధులుగా, అధికారులుగా, ఉపాధ్యాయులుగా తమ పాత్రలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకున్నారని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అలవర్చుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానంలో నిలవాలని వారు ఆకాంక్షించారు.

# మెట్ పల్లిలో స్వర్గీయ దుద్దిళ్ళ శ్రీపాద రావు జయంతి వేడుకలు



మెట్ పల్లి అమృత్ తెలంగాణ మార్చి02: ఈరోజు మెట్ పల్లి లోని టీపీసీసీ డెలిగేట్ సుజిత్ రావు ఆదేశాల మేరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ శాసనసభ స్పీకర్,ప్రజా బంధువు స్వర్గీయ దుద్దిళ్ళ శ్రీపాదరావు జయంతి సందర్భంగా పార్టీ కార్యాలయం లో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించి నివాళులు అర్పించిన కాంగ్రెస్ నాయకులు ఈ కార్యక్రమంలో మెట్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్,రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ ప్రధాన కార్యదర్శి అందే మారుతి,మెట్ పల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు ఖుతుబ్బుదిన్ పాషా,మల్లాపూర్ మండల ఫిషెర్మన్ అధ్యక్షులు రొడ్డ రాజు,నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కోడిమ్యాల దీపక్ రాజ్,ఇబ్రహీంపట్నం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లూరి సాగర్,

ఎన్నెడ్ల రాములు,కల్లెడ గంగాధర్,ఎండి జాఫర్,తోగిటి నాగరాజు,బైండ్ల శ్రీకాంత్,ఎండి అన్వర్ కాంగ్రెస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ల నిర్మాణ అనుమతులపై విచారణ జరిపించాలి

ఆలేరు టౌన్ ఆలేరు మున్సిపల్ కేంద్రంలో ఇళ్ల నిర్మాణ అనుమతులపై విచారణ జరిపించాలని, అవక తవకులకు పాల్పడువున్న, టౌన్ ప్లానర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ..ఆలేరు పట్టణంలో సోమవారం భారత్ నగర్ కాలనీ వాసులు, మున్సిపాల్ కార్యలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పలువురు మాట్లాడుతూ 8వ వార్డులో నూతనంగా ఇల్లు నిర్మాణం చేస్తున్న వ్యక్తి రోడ్డును ఆక్రమించుకొని ఇల్లు నిర్మాణం చేస్తున్న విషయమై, మున్సిపాలిటీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసేప్పటికీ పట్టించుకోవడంలేదని ఆరోపించారు. రోడ్డును ఆక్రమించుకొని ఇల్లు నిర్మాణం చేసి, ప్రజలు నడిచే దారికి ఇబ్బందులు గురయ్యే విధంగా వ్యవహరింస్తున్నా వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

వెంటనే విచారణ జరిపించి చర్యలు తీసుకొని ప్రజలకు న్యాయం చేయాలనీ డిమాండ్ చేశారు. లేని యెడల మున్సిపాలిటీ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డికి ఫిర్యాదు కాపీని అందజేశారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, టౌన్ ప్లానర్ వీరస్వామిని నవతెలంగాణ దినపత్రిక ఇంటి అనుమాతులపై వివరణ కోరగా .. రోడ్డును ఆక్రమించుకొని నిర్మాణం చేస్తున్న ఇంటి అనుమతిపై విచారణ జరుగుతుందని చెప్పారు. నిబంధనల మేరకే అనుమతులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జంపాల దశరథ, ఎగ్గిడి సంపత్, ఎగ్గిడి శ్రీనివాస్, చీర శ్రీనివాస్, ఎగ్గిడి పుల్లయ్య, మైల వెంకటేష్, కటకం హరి, కటకం విజయ్, బేతి గణేష్,దయ్యాల సంపత్, ఉమా,లక్ష్మి బాలమని, విమల తదితరులు పాల్గొన్నారు.

# అందమైన గులాబీలా మృణాల్ మెరుపులు




గులాబీల మధ్య నవ్వుతూ.. మృణాల్ ఠాకూర్ తన లేటెస్ట్ ఫోటోషూట్‌లో వసంతాన్ని స్వాగతించేసింది. గులాబీల మధ్య నవ్వుతూ.. మృణాల్ ఠాకూర్ తన లేటెస్ట్ ఫోటోషూట్‌లో వసంతాన్ని స్వాగతించేసింది. కోస్మోపాలిటన్ మ్యాగజైన్ కోసం ఆమె చేసిన ఈ ఫోటోషూట్ ఎంతో బ్యూటీఫుల్ గా ఉంది. పూలతో ముడిపడిన రంగుల దుస్తులు మరింత అందంగా హైలెట్ అయ్యాయి. పింక్, గ్రీన్, క్రీమ్ రంగుల్లో ఉండే డ్రెస్సులతో ఆమె వేసిన పోజులు మనసును తాకేలా ఉన్నాయి. ఈ ఫోటోలు ఆమెలోని ఫెమినిన్ గ్లామర్‌తో పాటు ఇంటెన్సిటీని కూడా చూపిస్తున్నాయి. తెలుగు ప్రేక్షకులకు 'సీతారామం' చిత్రంతో చాలా దగ్గరైన మృణాల్.. ఆ తర్వాత 'హాయ్ నన్న' లాంటి సినిమా ద్వారా మంచి గుర్తింపు పొందింది. తక్కువ సమయంలోనే దక్షిణాది పరిశ్రమలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకుంది. నటనలో ఆమె చూపించిన హావభావాలను ఇప్పటికే అన్ని వర్గాల ఆడియెన్స్ మెచ్చుకుంటారు. అదే అనుభూతిని ఈ ఫోటోల్లో కూడా పలికిస్తోంది. ఇక ఈ ఫోటోషూట్‌కు 'బ్లూమింగ్ ఇన్‌టు ఏ న్యూ సీజన్' అనే క్యాప్షన్ పెట్టిన మృణాల్.. వసంతాన్ని, కొత్త ప్రారంభం అంటూ అందమైన వివరణ ఇచ్చింది. ఫొటోషూట్ కోసం ఆమె ఫ్లవర్ ఆర్ట్‌ని పటిష్టంగా ఉపయోగించిన విధానం, బ్యాక్‌డ్రాప్ డిజైన్ వరకు అన్నీ ప్రత్యేకంగా నిలిచాయి. మొత్తానికి మృణాల్ ఠాకూర్ తన ఫోటోషూట్‌తో మరోసారి ఎంతగానో ఎట్రాక్ట్ చేసింది. ఇక ఆమె సినిమాల విషయానికి వస్తే.. మంచి విజయాలు వచ్చిన తరువాత కూడా అమ్మడు తొందర పడకుండా నెమ్మదిగా కంటెంట్ ఉన్న సినిమాలను సెలెక్ట్ చేసుకుంటోంది. ప్రస్తుతం బాలీవుడ్ లో సన్ ఆఫ్ సర్దార్ 2, పూజా మేరీ జాన్ లాంటి సినిమాల్లో నటిస్తోంది. అలాగే తెలుగులో అడివి శేష్ డెకాయిట్ లో కూడా ఆమె హీరోయిన్ గా నటిస్తోంది.

# బీచ్‌లో అందాల బికినీ శిల్పం



తాజాగా మరోసారి అంతా షాక్ అయ్యే విధంగా బికినీ ఫోటోలను షేర్ చేయడం ద్వారా వేదిక వార్తల్లో నిలిచింది. రెండు దశాబ్దాల క్రితం తమిళ్ మూవీ 'మద్రాసి' సినిమాతో సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ వేదిక. ఇండస్ట్రీలో అడుగు పెట్టి సుదీర్ఘ కాలం అయినా, నాలుగు పదుల వయసుకు చేరువ అయినా కూడా వేదిక అందం ఏమాత్రం తగ్గలేదు. ఈమధ్య కాలంలో వేదిక సోషల్ మీడియాలో షేర్ చేస్తున్న ఫోటోలు, వీడియోలు వైరల్ అవుతున్నాయి. కెరీర్ మొదటి నుంచి అందంగా, గ్లామర్ గా కనిపిస్తూ వస్తున్న వేదిక ఇప్పుడు కూడా ఏమాత్రం తగ్గకుండా అందంగా కనిపిస్తూ సోషల్ మీడియాలో నెటిజన్సను కవ్విస్తోంది. తాజాగా మరోసారి అంతా షాక్ అయ్యే విధంగా బికినీ ఫోటోలను షేర్ చేయడం ద్వారా వేదిక వార్తల్లో నిలిచింది. ప్రీ రిలీజ్ ఈవెంట్ బిగ్ ట్విస్ట్! తెలుగులో 2007లో నందమూరి కళ్యాణ్ రామ్‌తో కలిసి 'విజయదశమి' సినిమాతో అడుగు పెట్టిన వేదిక ఆ తర్వాత చాలా తెలుగు సినిమాల్లో నటించింది. కానీ ఆశించిన స్థాయిలో గుర్తింపు దక్కలేదు. తెలుగులో ఈమె బాలకృష్ణకు జోడీగా రూలర్ సినిమాలో నటించి మెప్పించింది. ఆ తర్వాత బంగార్రాజు సినిమాలో ముఖ్య పాత్రలో నటించడం ద్వారా మరోసారి అందరి దృష్టిని ఆకర్షించింది. తెలుగులో ఈమె గత ఏడాది రజాకార్, ఫియర్ సినిమాల్లో నటించి మెప్పించింది. గత ఏడాదిలోనే ఒక తమిళ్ సినిమాను కూడా చేయడం ద్వారా గత ఏడాది బిజీ బిజీగా ఉంది. ఈ ఏడాది రెండు లేదా మూడు సినిమాలతో ఈ అమ్మడు ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే గన అనే కన్నడ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇదే ఏడాదిలో మరో రెండు సినిమాలతో వేదిక ప్రేక్షకుల ముందుకు వస్తుందని తెలుస్తోంది. సోషల్ మీడియాలో ఈమె రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా వార్తల్లో నిలుస్తుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో 4.2 మిలియన్ ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న వేదిక రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. ఇప్పటికే చాలా సార్లు బికినీ ఫోటోలను షేర్ చేయడం అందరి దృష్టిని ఆకర్షించింది. ఇప్పుడు మరోసారి టూ పీస్ బికినీతో బీచ్‌లో ఫోటోలకు ఫోజ్ ఇచ్చి అందాల శిల్పమా అంటూ అంతా ఆశ్చర్య పోయే విధంగా ఫోటోలకు ఫోజ్ ఇచ్చి ఇలాంటి అందమైన ఫోటోలను షేర్ చేయడం వల్లే వేదిక కి ఇంకా వరుసగా ఆఫర్లు వస్తున్నాయి. అయితే స్టార్ హీరోల సినిమాలో నటించకున్నా ఈ స్థాయిలో పాపులారిటీ దక్కించుకుని, ఎక్కువ సినిమాల్లో నటించే అవకాశాలు దక్కించుకోవడం ఈమెకు మాత్రమే చెల్లిందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. కెరీర్ ఆరంభంలో మోడలింగ్ చేసిన ఈమె ప్రముఖ కంపెనీకి చెందిన యాడ్స్‌లో నటించడం ద్వారా గుర్తింపు దక్కించుకుని సినిమాల్లో ఆఫర్లు సొంతం చేసుకుంది. పలు అవార్డులను రివార్డులను, రికార్డ్‌లను సొంతం చేసుకున్న వేదిక ముందు ముందు అయినా తన అందంకు తగ్గ స్థాయిలో ఆఫర్లను సొంతం చేసుకుంటుందేమో చూడాలి

# చక్కనమ్మల స్నేహం అలా కుదిరింది!

బాలీవుడ్ యువనాయికలు సారా అలీఖాన్- జాన్వీ కపూర్ ల మధ్య స్నేహం అభిమానులకు కొత్తేమీ కాదు. ఈ జోడీ తరచుగా వెకేషన్ స్పాట్స్ నుంచి ఫోటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తుంటారు. ఇటీవలే ఆ ఇద్దరూ కలిసి కేదార్ నాథ్ ఆలయాన్ని సందర్శించినప్పటి ఫోటోలు వైరల్ అయ్యాయి. సారా అలీ ఖాన్ - జాన్వీ కేదార్ నాథ్ ఆలయాన్ని సందర్శించిన ఫోటోలను అభిమాన సంఘాలు పోస్ట్ చేయగా వాటిలో ఇద్దరూ శివుడిని ప్రార్థిస్తూ కనిపించారు. అంతకుముందు కూడా వీరిద్దరూ రణవీర్ సింగ్ 'ది బిగ్ పిక్చర్' అనే టీవీ షోలో కనిపించారు. తమ మధ్య స్నేహం గురించి మాట్లాడారు. ఎపిసోడ్ సమయంలో రణవీర్- జాన్వీ -సారాలను వారి స్నేహం (స్నేహితులు) గురించి ఎక్కువగా అడిగాడు. నిజానికి ఆ ఇద్దరికీ కామన్ ఫ్రెండ్స్ ఉన్నారు. కాలక్రమంలో స్నేహం కుదిరింది. జాన్వీ అందించిన వివరాల ప్రకారం.. ఆ ఇద్దరికీ చిన్నప్పటి నుంచి పరిచయం ఉంది. నేను సారాను ఒక అవార్డు ఫంక్షన్ లో మొదటిసారి కలిశాను.




# ఎర్ర చీర కట్టులో సంయుక్త



రెగ్యులర్‌గా సోషల్ మీడియా ద్వారా ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్ ద్వారా సంయుక్త మీనన్ తన అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. మలయాళ సినిమా పాప్‌కార్న్‌తో దాదాపు దశాబ్ద కాలం క్రితం సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ సంయుక్త మీనన్. వరుసగా మలయాళ సినిమాలు చేస్తూ వచ్చిన ఈమెకు 2018లో కలరి అనే తమిళ సినిమాలో నటించే అవకాశం దక్కింది. అత్యధిక మలయాళ సినిమాల్లో నటించిన సంయుక్త మీనన్ ఆ తర్వాత తమిళ్‌లో ఎక్కువ సినిమాల్లో నటించింది. ఈ అమ్మడు తెలుగు ప్రేక్షకులకు కూడా పలు సినిమాలతో సుపరిచితురాలు అయింది. తెలుగులో ఈమె భీమ్లా నాయక్ సినిమాలో ముఖ్య పాత్రలో నటించడం ద్వారా టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చింది. తెలుగు సినిమా ఇండస్ట్రీలో ఈ అమ్మడికి విరూపాక్ష సినిమాతో భారీ విజయం దక్కింది. తెలుగులో వరుసగా సార్, విరూపాక్ష, బింబిసార సినిమాలతో సక్సెస్‌లు దక్కాయి. దాంతో ఈ అమ్మడు ఎక్కువ ఆఫర్లు దక్కించుకుంది. ప్రస్తుతం తెలుగులో ఈమె మూడు సినిమాల్లో నటిస్తోంది. మూడు సినిమాలు సైతం ఈ ఏడాదిలోనే ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. భారీ అంచనాల నడుమ రూపొందుతున్న అఖండ 2 సినిమాలోనూ ఈమె కీలక పాత్రలో కనిపించబోతుందనే వార్తలు వస్తున్నాయి. ఇప్పటి వరకు ఆ విషయమై అధికారికంగా క్లారిటీ రాలేదు. నారి నారి నడుమ మురారి సినిమాలోనూ ఈమె నటిస్తున్న విషయం తెల్సిందే.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com